

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్థ గాథ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు...
కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో
చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు...
విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...
ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..!
పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన
ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!
ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న
ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్
**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

# 20

విశాఖపట్నంలో వ్యవహారం సెటిల్ చేసుకొని తిరిగి వరంగల్ వచ్చాను. అప్పటికి చాలా మంది మిత్రులు జైళ్ళనుంచి బయటకి వచ్చేసారు. చాలామంది మీద కేసులు నిలబడలేదు.

నేను మా ఊరికి కూడా వెళ్ళకుండా, సరాసరి మా పెద్ద బావ దగ్గరికి వెళ్ళాను. జరిగిందంతా చెప్పాను.

"ఎంత కావాల్రా డబ్బు?" అని అడిగాడు.

నేను మాట్లాలేదు.

మూడు వేలు ఇచ్చి, "నువ్వు లెక్చరర్‌వి. ఇంకా స్టైల్‌గా ఉండాలి" అని మూడు జతల బట్టలు కుట్టించాడు. షూస్ కూడా కొనిపెట్టాడు.

అక్కడ నుండి మా ఇంకో మావయ్య శ్యామలరావు దగ్గరకు వెళ్ళాను. ఆయనకు ప్రింటింగ్ ప్రెస్ ఉంది.

నేను పెట్టబోయే సంస్థ గురించి చెప్పి, "నాకు కొన్ని పోస్టర్లూ, పాంప్లెట్లూ కావాలి" అని అడిగాను.

"ఇన్‌స్టిట్యూట్‌కి పేరు?" అని ప్రశ్నించాడు.

ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉండే అన్ని కోచింగ్ సెంటర్లకీ డేవిడ్స్, ఆక్స్‌ఫర్డ్ మొదలైన ఇంగ్లీష్ పేర్లే ఉండేవి

నా దగ్గర ఇంగ్లీష్ నేర్చుకోవటానికి వచ్చేవాళ్ళందరూ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగువాళ్ళు. ఇంగ్లీష్ రానివాళ్ళు.

ఇంగ్లీషు పేరుతో బంబాట్ చెయ్యటం కన్నా తెలుగు పేరు పెడితే బాగుంటుందేమో అనే ఆలోచన వచ్చింది. పటాటోపమైన పేర్లతో బెదరగొట్టటం కన్నా, హృదయానికి దగ్గరగా ఉండే పేరుతో మనసుకు దగ్గరవటం మంచిది అనిపించింది.

అప్పుడు నాకు తట్టిన పేరు "మేధావి". "వి" అనే అక్షరం తీసేసి "మేధ" అనే పేరుని ఫైనలైజ్ చేశాను.

నా పేరు 'చిరంజీ' కి 'వి' కలిపారు పెద్దలు. నా సంస్థకి 'వి' తీసేసి 'మేధా' చేసాను.

ఆ విధంగా మొట్టమొదటిసారి 'మేధ ' రూపుదిద్దుకుంది.

---

అయిదువేల పోస్టర్లూ, పాంప్లెట్లూ ప్రింటు చేసి ఇచ్చాడు శ్యామలరావు.

అక్కడి నుంచి ఖాజీపేట వెళ్ళాను. అక్కడ నాకో స్నేహితుడున్నాడు. అతడి చేతివ్రాత చాలా బాగుండేది. బ్యానర్స్ బాగా వ్రాసేవాడు. దయతో అతడు దాదాపు వంద బ్యానర్ల దాకా ఉచితంగా వ్రాసిచ్చాడు.

నేను ఒక్కడినీ వైజాగులో ఏమీ చేయలేనని నాకు తెలుసు. ఖాజీపేటలో ఖాళీగా ఉన్న ముగ్గురు స్నేహితులని సహాయం అడిగాను.

మొత్తం నలుగురం కలిసి పొద్దున్నే విశాఖపట్నం స్టేషన్‌లో దిగాము. సామాన్లు రైల్వేస్టేషన్‌లో పెట్టేసి ఇంటి కోసం ఊరి మీద పడ్డాము. మేము పెట్టబోయే కోచింగ్ సెంటర్ డాబాగార్డెన్స్ కాబట్టి, దగ్గర్లో అయితే బావుంటుందని అనుకున్నాము

ఒక్కొక్కరూ ఒకొక్క వీధికి వెళ్ళి రూము వెతకాలి. చుట్టుపక్కల తక్కువ అద్దెకు రూములు ఏమున్నాయని వెతుకుతూ ఉండగా ఒక ఇరుకు స్లమ్‌లో నాలుగు వందల రూపాయలకి గది దొరికింది. సామాన్లన్నీ అక్కడ పేర్చుకున్నాం. ఆ రోజు నుంచీ మా పని ప్రారంభమయింది.

ఉడకబెట్టిన జిగురు, పోస్టర్లు పట్టుకుని రాత్రి తొమ్మిది అవుతూండగా ఊరు మీద పడేవాళ్ళం. వర్కింగ్ డిన్నర్ (డబ్బు లేక సగం తినే అన్నానికి వర్కింగ్ లంచ్/డిన్నర్ అని పేరు పెట్టాను) తిని బయల్దేరేవాళ్ళం. తెల్లవారుజామున నాలుగు వరకూ డాబా గార్డెన్స్ నుంచీ విమానాశ్రయం వరకూ విశాఖపట్నం అంతా పోస్టర్లు అతికించేవారం.

అలా వారం రోజులు పబ్లిసిటీ చేశాం.

తర్వాత సంస్థ ప్రారంభించటానికి సంసిద్ధులమయ్యాం.

పొద్దున్నే ఎనిమిదింటికి వచ్చి మేమే హాలంతా శుభ్రంగా ఊడ్చుకొని, పదింటికి రెడీ అయి కూర్చునేవాళ్ళము. నేను డైరెక్టర్‌ని, నరేందర్ రిసెప్షనిస్టు, రవీందర్ కౌన్సిలర్, వీరేశ్వర్ ఆఫీసు బాయ్...ఇవీ మా వేషాలు.

మొత్తం ఒక కోచింగ్ సెంటర్ వాతావరణాన్ని అక్కడ సృష్టించాము.

అయితే మేము ఊహించని ప్రమాదం మరో వైపు నుంచి వచ్చింది.

## 21

నేను విశాఖపట్నంలో సంస్థ ప్రారంభించబోతున్నానని 'కె'కి తెలిసింది. నాకన్నా ముందే వచ్చి అక్కడ తన సంస్థని ప్రారంభించాడు. అతడు మాకన్నా లక్షల రెట్లు డబ్బున్నవాడు. కొన్ని వేల పోస్టర్లు వేశాడు.

మేము విశాఖపట్నంలో దిగేసరికి కొత్త సంస్థ ప్రారంభం కాబోతోందని ఊరంతా కనబడింది.

మేమేం బెదరలేదు. ఒక సైన్యంలాగా పని చేశాం.

మేం అతికించిన పోస్టర్లు అన్నిటి మీదా అతడు తన పోస్టర్లు అతికించేవాడు. అతడికి మ్యాన్ పవర్ ఎక్కువ. మేం నలుగురమే. అందుకని మా 'పోస్టర్లు అంటించే' టైమింగ్ మార్చుకున్నాం. రాత్రి రెండింటి నుంచీ తెల్లవారుజామున అయిదింటి వరకూ అతికించే వాళ్ళం.

అతను తిరిగి వాటిమీద అతికించాలంటే రాత్రి వరకూ ఆగాలి.

ఆ ఒక్కరోజూ విద్యార్థులు చూస్తే చాలు.

అతడు అంతటితో ఆగలేదు. నేను తన దగ్గర పని చేసిన సర్టిఫికెట్‌ని లేమినేట్ చేయించి, తన దగ్గర చేరడానికి వచ్చే విద్యార్థులందరికీ "ఫలానా చిరంజీవి నా విద్యార్థే. కొత్తగా సంస్థ పెడుతున్నాడు. అతడు అతని దగ్గర చేరతారా? నా దగ్గర చేరతారా? మీరే ఆలోచించుకోండి" అని కాన్వాస్ చేసేవాడు.

నేను తొలి బ్యాచ్ మొదలుపెట్టే రోజే అతను కూడా ప్రారంభించటానికి ముహూర్తం పెట్టుకున్నాడు. మొత్తానికి ఏమయితేనేం, నాకు రెండు బ్యాచ్‌లూ, అతనికి నాలుగు బ్యాచ్‌లూ రిజిస్ట్రేషన్స్ జరిగాయి.

పొద్దున్న పదింటికి మా కోచింగ్ సెంటర్ ప్రారంభం. నేను నీటుగా డ్రస్సయ్యాను. మావాళ్ళందరూ కూడా టిప్‌టాప్‌గా తయారయ్యారు.

మనసంతా ఉద్విగ్నంగా ఉంది.

విద్యార్థులు రావటం మొదలుపెట్టారు. రిజిస్ట్రేషన్స్ జరుగుతున్నాయి. అందరూ ఫారాలు పూర్తిచేసి డబ్బులు కడుతున్నారు.

ఆ సమయంలో నాకొక టెలిగ్రాం వచ్చింది.

YOUR BROTHER DIED BY ACCIDENT.

---

నా కాళ్ళూ చేతులూ ఆడలేదు. ఇంకో నలభై అయిదు నిముషాల్లో ప్రథమ బ్యాచ్ ప్రారంభమవుతుంది. మెదడంతా తిమ్మిరెక్కినట్టూ అయిపోయింది. ఏం చేయాలో తోచలేదు. ఇదీ నా పరిస్థితి.

చిన్నన్నయ్య డ్రైవరుగా పని చేస్తున్నాడు. ఏ రాష్ట్రంలో ఏ ప్రాంతంలో ఆక్సిడెంటు జరిగిందో, బాడీ ఎక్కడ పడి ఉందో, అమ్మ పరిస్థితి ఏమిటో... ఏమీ తెలీదు.

ఆరోజుల్లో సెల్‌ఫోన్లు లేవు. ట్రంక్ కాల్ బుక్ చేసుకోవాలంటే రెండు మూడు గంటలు పడుతుంది.

ఆ సమయంలో నా స్నేహితులు నాకు ధైర్యాన్ని ఇచ్చారు. "ఎలానూ మనం రాత్రి లోపు వరంగల్ వెళ్ళలేము. రైళ్ళు కూడా ఏమీ లేవు. క్లాస్ ప్రారంభించేద్దాం" అన్నారు.

కానీ నాకు మూడ్ లేదు. చిన్నన్నయ్యకి ఏం జరిగిందో తెలుసుకోవాలని ఆతృత. దాని కన్నా ముఖ్యంగా అమ్మ ఎలా ఉందోఅని టెన్షన్.

అన్నయ్యకీ నాకూ మధ్యా మూడు సంవత్సరాలే తేడా. వాడు నాకు చాలా క్లోజు. అన్నీ పంచుకొనేవాళ్ళం.

లోపలి నుంచి దుఖం తెరలు తెరలుగా పొంగి వస్తోంది.

మా ఊరికి ఫోన్ చేశాం. మా ఊరిలో ఒకే ఒక ఫోన్ ఉండేది. అది కూడా పోస్ట్‌మ్యాన్ ఇంట్లోనే..! మా ఊరికి ఏదైనా ఫోన్ వస్తే, ఈ పోస్ట్‌మ్యాన్ వెళ్ళి వాళ్ళను తీసుకొచ్చినందుకు అతనికి రెండు రూపాయలు ఇచ్చేవారు.

పోస్టాఫీసుకి వెళ్ళి అతనికి ఫోన్ చేశాను.

"బిడ్డా, నీ అన్నకు ఏమయినాదో నాకైతే తెలువది. మీ అమ్మావాళ్ళూ బాయికాడికి వోయి ఉంటారు. ఆడికి బోయి, ఆల్లను తీసుకురానీకి టైము పడుద్ది. గంటాగి ఫోను చేయి" అన్నాడు.

ఇక చేయటానికి ఏమీ లేదు. క్లాసుకు టైము దగ్గర పడింది.

బాధనంతా దాచుకొని, నవ్వుతూ వెళ్ళి "హాయ్" అంటూ పాఠం ప్రారంభించాను.

చెపుతున్నానన్న మాటే గానీ మనసిక్కడ లేదు. తోటలో పళ్ళు, ఏటిలో స్నానాలు, చెట్ల నీడలో గోళీలు... అన్నీ గుర్తొచ్చి ఒక వైపు ఏడుపొస్తోంది.

గంటసేపు ఏం చెప్పానో నాకు తెలీదు కానీ ఆఖరున మాత్రం విద్యార్థులంతా చప్పట్లు కొట్టి "క్లాసు చాలా బాగుంది సార్" అని పొగడటం మాత్రం మర్చిపోలేను. పిల్లలందరూ వెళ్ళిపోగానే గదిలోకి వచ్చి భోరున ఏడ్చేశాను.

తర్వాత మళ్ళీ బూత్‌కి వెళ్ళి మా ఊరికి ఫోన్ చేశాను. పెద్దన్నయ్య మా ఊళ్ళో ఆర్.ఎం.పి. డాక్టరు. నాతో ఫోనులో మాట్లాడాడు. అదృష్టవశాత్తూ పోస్టుమ్యాన్‌కి వెంటనే దొరికాడు.

"చిన్నాడికి  ఏమీ కాలేదురా. నువ్వు కంగారు పడొద్దు. ఎవరో నిన్ను బెదిరించడానికి అలా ఇచ్చి ఉంటారు" అన్నాడు.

ఒక క్షణం నాకేమీ అర్థం కాలేదు. నేను వింటున్నది నిజమా? నిజమేనా? మరి ఆ టెలిగ్రాం ఎవరు పంపి ఉంటారు?

అయితే, ఈ సందిగ్ధం కన్నా, అన్నయ్యకేమీ కాలేదన్న సంతోషంతో నా మనసు తేలిక పడింది.

క్లాసు తర్వాత మధ్యాహ్నం రూమ్‌కి వచ్చి నాకొచ్చిన టెలిగ్రామ్‌ను చూస్తూ ఆలోచించటం మొదలు పెట్టాను.  ఆ వాక్యాన్ని చాలాసార్లు చదివాను.

YOUR BROTHER DIED BY ACCIDENT

సాధారణంగా 'Died' అనే పదం తర్వాత 'Of' వస్తుంది.

ఇక్కడ "Died by" అని ఉంది. ఈ 'Die' అనే పదం తర్వాత 'by' అని వాడటం నా పార్ట్‌నర్‌కి అలవాటు. మేము కలిసున్న కొద్ది రోజుల్లో తను ఇంగ్లీష్ మాట్లాడుతున్నప్పుడు ఒక రోజు "He died by cancer" అంటే నేనే అతన్ని కరెక్ట్ చేశాను.

అది నాకు గుర్తొచ్చింది.

మంచు విడిపోయినట్టూ అంతా క్లియర్ అయింది.

ఇది 'కె' పనే.

రక్తం సలసలా మరిగి ఆవేశం వచ్చింది. తమాయించుకున్నాను. ఆరోజు సాయంత్రం ఇంకొక బ్యాచ్ ఉంది. ఆ బ్యాచ్‌కి క్లాస్ తీసుకున్నాను. ఎక్కడా బయట పడలేదు.

ఆ సాయంత్రం 'కె' దగ్గరకు బయల్దేరాను. నా మిత్రుడు నరేంద్ర రెడ్డిని నాతో రమ్మన్నాను. నరేందర్ కూడా "పద. తేల్చుకుందాం" అని నాతో బయలుదేరి వచ్చాడు.

వంట కత్తి ఒకటి జేబులో పెట్టుకున్నాను. అయితే నేను కత్తి పెట్టుకున్న విషయం నరేందర్ రెడ్డికి తెలీదు. మిగతా ఇద్దరికీ అసలు మేము అక్కడికి వెళ్తున్నామన్న సంగతే తెలీదు.

ఆ రోజు అతడు దొరికుంటే ఆ ఆవేశంలో నిజంగా నేను హంతకుడిని అయి ఉండేవాడినేమో.

అది నా అదృష్టమో, అతడి అదృష్టమో తెలీదు కానీ, మేము వెళ్ళిన సమయానికి అతను ఇన్‌స్టిట్యూట్‌లో లేదు.

లోపల వాళ్ళని అడిగితే "సార్ ఎక్కడికి వెళ్ళారో తెలీదు" అన్నారు.

అతడి కోసం మూడు గంటలు ఎదురు చూశాం. రాలేదు. రాత్రి పదకొండు గంటలకి మా రూమ్‌కి తిరిగి వచ్చాం.

నేను అక్కడికి వచ్చి, మూడు గంటలు ఎదురు చూశానని అతనికి తెలిసింది.

నా ఆవేశమూ, గత చరిత్రా కూడా అతడికి తెలుసు. తప్పు చేసిన వాడిని భయం నీడలా వెంటాడుతుంది.

అదే భయంతో ఆ రోజే అతను వైజాగ్ నుండి వరంగల్ పారిపోయాడు.

## 22

'కె' విశాఖపట్నం నుండి వెళ్ళిపోయాక కూడా అతడి సంస్థ నడుస్తూనే ఉండేది. అసిస్టెంట్‌స్‌ని పెట్టి ఇన్‌స్టిట్యూట్‌ని నడిపాడు.

నా ఏకైక ఆశయం అతడి సంస్థని మూతపడేలా చేయటం.

అదే నేను చేసిన తప్పు.

నా సంస్థని ఎలా అభివృద్ధి పరచుకోవాలా అని ఆలోచించడం మానేసి, అతడిని ఎలా దెబ్బ కొట్టాలా అని ఆలోచించటం మొదలుపెట్టాను.

ఎప్పుడైతే ఒక వ్యాపారస్తుడు తన గురించి ఆలోచించటం మానేసి తన శత్రువు గురించి ఆలోచిస్తూ ఉంటాడో, ఆ శత్రువు అతని గుండెలో నిద్రపోతున్నట్టు లెక్క. మన నాశనానికి హేతువు వాడే అవుతాడు.

నేను సరిగ్గా అదే సాలెగూడులో పడ్డాను.

అతడి సంస్థలో ఎంతమంది విద్యార్థులు చేరారు? వాళ్ళు ఏ విధంగా ఫీలవుతున్నారు? మొదలైనవన్నీ ఎప్పటికప్పుడు వాకబు చేస్తూ వచ్చాను. క్రమక్రమంగా అతడి సంస్థలో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవటం నాకు అమితమైన సంతోషాన్ని కలిగించేది. ఈ సంతోషంలో నేను నా సంస్థలో తీసుకోవలసిన జాగ్రత్తల పట్ల నిర్లక్ష్యం వహించాను.

నేను గొప్పగా మాట్లాడగలను తప్ప స్కీమింగ్ లేదు. మొదటి రోజు పాఠాలు ఎలా చెప్పాలి? ఏ వరుసలో సిలబస్ పూర్తి చేయాలి అన్న ప్లానింగ్ సరిగా లేకపోయేసరికి అయోమయంలో పడ్డాను.

అయోమయంలో ఉన్న మనిషి పూర్తిగా నిరాశ వైపు వెళతాడు. లేదా జాగ్రత్త పడి తప్పులు దిద్దుకుంటాడు. రెండే దార్లు.

పరిస్థితులు అలాగే కొనసాగి ఉంటే నేను జాగ్రత్త పడి నా ఉపన్యాస వృత్తి పట్ల శ్రద్ధ తీసుకునేవాడిని. అలా జాగ్రత్త పడనివ్వకుండా రెండు సంతోషకరమైన వార్తలు తెలిసాయి.

అందులో మొదటిది, 'కె' తన ఇన్‌స్టిట్యూట్ మూసేస్తున్నాడని...! ఆ రోజు పండుగ చేసుకున్నాను.

ఇంతలో మా మొదటి బ్యాచ్ స్టూడెంట్స్ బయటకొచ్చారు. మా రిజల్ట్స్ చాలా బాగున్నాయి. మరి కొంతమంది స్టూడెంట్స్ చేరారు. ఇది రెండో విజయం (అనుకున్నాను).

అయిదారు నెలల తరువాత లెక్క చూసుకుంటే దాదాపు యాభై వేలు లాభం తేలింది.

యాభై వేలు..!

అయిదు నెలల్లో యాభై వేలు సంపాదించాను..!!

ఒక వైపు నా ప్రత్యర్థి ఓటమి, మరోవైపు నా విజయం..!!!

చేతిలో యాభై రూపాయలు లేనివాడిని, ఒక్కసారిగా యాభై వేల రూపాయలు సంపాదించే సరికి మైకం కమ్మింది.

నా జీవితంలో వెయ్యి రూపాయల నోట్లు లెక్క పెట్టటమనేది అప్పుడే మొట్టమొదటిసారి జరిగింది.

నా స్టూడెంట్‌స్‌లో కొంతమందికి కార్లు ఉండేవి. వాటిలో నన్ను తీసుకెళ్ళేవారు. ఐశ్వర్యవంతమైన జీవితం అనుభవించటం మొదలుపెట్టాను. బీచ్ పార్టీలూ, లేట్ నైట్ షోలూ... ఎక్కడో తెలంగాణా మారుమూల గ్రామీణ ప్రాంతం వాడికి, ఒక్కసారిగా అయిదు నక్షత్రాల సౌఖ్యం కళ్ళ ముందు కనపడేసరికి అదో రకమైన మత్తు ఆవహించింది.

'పొద్దున్నే ఆలస్యంగా లేవటం, మరుసటి రోజు చెప్పవలసిన పాఠాలు ముందుగా తయారు చేసుకోకపోవటం' లాంటి లోటుపాట్లని గమనించక పోవటం వల్ల చాప క్రింద నీరులా మా సంస్థ పట్ల చెడ్డ పేరు వ్యాపించ సాగింది.

అయితే ఆ విషయం నా వరకూ రాలేదు.

విద్యార్థుల దగ్గర అప్పులు చేయటం ప్రారంభించాను. పెద్దపెద్ద అప్పులేమీ కాదు. అయిదొందలూ, వెయ్యీ మాత్రమే. కానీ దాని వల్ల వారికి నా మీద గౌరవం తగ్గిపోసాగింది. 'గురువు పట్ల ఉండవలసింది గౌరవం కాదు–స్నేహభావం' అన్న ఆత్మవంచనతో వారితో పాటూ హోటల్స్‌కి వెళ్ళేవాడిని.

ఐశ్వర్యవంతులైన పిల్లలు వాళ్ళు. ఖరీదైన హోటల్స్‌కి తీసుకెళ్ళేవారు. రెండు మూడు సార్లు వారు బిల్లు ఇచ్చినా, నాలుగోసారైనా నేను కూడా ఇవ్వాలి కదా.

డబ్బు ఆవిధంగా ఖర్చయ్యేది.

జీవితం చాలా బాగా సాగిపోతోందన్న అభిప్రాయంలో ఉండేవాడినే తప్ప, క్రమక్రమంగా నా పెట్టుబడి అంతా కరిగిపోతోంది అన్న విషయం తెలుసుకో లేకపోయాను.

కొంతకాలం అయ్యేసరికి ఇన్‌స్టిట్యూట్‌కి కరెంటు బిల్లు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది.

ఆ సమయంలో పిడుగుపాటులా బిల్డింగ్ ఓనర్ శ్రీనివాస్ నన్ను పిలిచాడు. అదే ఆఖరి బ్యాచ్ అనీ, తాము (నేను ఇన్‌స్టిట్యూట్ పెట్టిన) బిల్డింగ్ ఖాళీ చేస్తున్నామనీ చెప్పాడు.

ఇది ఊహించని షాకింగ్ న్యూస్.

మెదడు బ్లాంక్ అయిపోయింది.

ఏ చేయాలో సలహా అడుగుదామంటే స్నేహితులెవరూ లేరు. నేను విశాఖపట్నంలో దాదాపు సెటిల్ అయ్యాను కాబట్టి నా స్నేహితులందరూ తమ తమ కెరియర్స్ చూసుకోవటానికి వరంగల్ వెళ్ళిపోయారు.

నేనొక్కడినే మిగిలాను. నాతోపాటూ చెడ్డపేరు మిగిలింది.

విశాఖపట్నంలాంటి ఊరిలో ఒక వార్త పాదరసంలా పాకటానికి ఎక్కువ సమయం పట్టదు.

ఒకవైపు మేయింటేనేన్స్ సమస్య. మరోవైపు అప్పుల తాకిడి.

నా దగ్గర చదువుకున్న విద్యార్థులే వచ్చి అడుగుతూంటే మొహం చూపించలేక పోయేవాడిని. ఇంతలో బ్యాచ్ మొదలైంది. కొత్త బ్యాచ్‌లో ఎక్కువ మంది జనం చేరలేదు.

మరో బిల్డింగ్ అద్దెకి తీసుకోవటం కాదు కదా, దాని ముందు బోర్డు తగిలించటానికి కూడా డబ్బులు లేవు. ఆ పరిస్థితులలో నాకు ఒకటే మార్గం మిగిలింది.

విశాఖపట్నం నుంచి బిచాణా ఎత్తేయటం.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)